

చొప్పదండి రోడ్ షోలో నినదిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, పక్కన కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## క్రికెట్ ఆడి.. జిమ్ చేస్తూ

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వినూత్న ప్రచారం

బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపుకోసం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వినూత్నంగా ప్రచారం సాగిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియం, ఎస్‌కేఎన్‌ఆర్ కాలేజీ గ్రౌండ్, రోటరీపార్క్, ధరూర్ క్యాంప్‌లో వాకర్లు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, యువకులతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మినీ స్టేడియంలోని ఓపెన్ జిమ్‌లో కాసేపు వ్యాయామం చేసి, ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో యువకులతో కలిసి క్రికెట్ ఆడారు. గోవర్ధన్‌ను ఆశీర్వదిస్తే.. జగిత్యాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

- జగిత్యాల, ఏప్రిల్ 28



# కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు

"పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు ఒక్కటైనయ్. బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నయ్. అందుకే కొన్ని చోట్ల కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెడితే, మరికొన్ని సీట్లల్లో బీజేపీ డమ్మీలను పెట్టింది. ఈ ధైర్యంతోనే బీఆర్‌ఎస్ ఒక్క సీటు కూడా గెలవదంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారు" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని, పాలిచ్చే ఆవును విడిచి పొడిచే దున్నపోతును తెచ్చుకున్నట్లుగా ఉందని ఆలోచనలో పడ్డారన్న ఆయన, కరీంనగర్‌లో ఆ పార్టీకి ఓట్లు వేసే పరిస్థితి లేదని, అందుకే ఆ రెండు పార్టీలు ఒక్కటై డమ్మీ అభ్యర్థిని నిలబెట్టాయని మండిపడ్డారు. ఆదివారం కరీంనగర్, మానకొండూర్, వేములవాడలో బూత్ లెవల్ కమిటీల సమావేశానికి హాజరయ్యారు. చొప్పదండిలో భారీ రోడ్‌షో నిర్వహించి, ఆయాచోట్ల మాట్లాడారు.

- బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు తెరవెనుక కుట్రలు
- అందుకే కరీంనగర్‌లో హస్తం నుంచి డమ్మీ అభ్యర్థి
- బీఆర్‌ఎస్ శ్రేణులు సత్తాచూపాలి
- వినోద్‌కుమార్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలి
- ప్రజా శక్తిని మించింది లేదు
- 10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలిస్తే కేసీఆర్ రాష్ట్రంలో శాసిస్తరు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కరీంనగర్, మానకొండూర్, వేములవాడలో బూత్ లెవల్ కమిటీల సమావేశాలు
- చొప్పదండిలో రోడ్‌షోకు హాజరు

చొప్పదండిలో జరిగిన రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు



కరీంనగర్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ)/ కరీంనగర్ కార్పొరేషన్/ చొప్పదండి/ వేములవాడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై బీఆర్‌ఎస్‌ను ఓడించాలని కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని, ఓటుతో సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రజలకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని, పాలిచ్చే ఆవును విడిచి పొడిచే దున్నపోతును తెచ్చుకున్నట్లుగా ఉందని ఆలోచనలో పడ్డారని కేటీఆర్ అన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసే పరిస్థితి లేదని, ఇక్కడ ఎట్లాగూ ఓట్లు పడవని కొత్త ఎత్తులు వేశారన్నారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పోటీ చేయాలని ప్రయత్నాలు చేశారని, వారిని కాదని ఎవరూ గుర్తు పట్టని వ్యక్తిని అభ్యర్థిగా పోటీలో నిలబెట్టారని విమర్శించారు. ఇది బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు కావడం కాదా..? అని నిలదీశారు. కాంగ్రెస్ అభ్యర్థి మహామేధావిలా ఉన్నాడని ఎద్దేవా చేశారు. కనీసం ఆయనను కరీంనగర్ ప్రజలైనా గుర్తిస్తారా..? అని ప్రశ్నించారు. ఈ డమ్మీ అభ్యర్థి గురించి ప్రతిచోటా చెప్పి డిపాజిట్ దక్కకుండా తీర్పు ఇవ్వాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కరీంనగర్ ప్రజల ఆలోచనను తక్కువ అంచనా వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మూతి మీద కొట్టినట్లు సమాధానం చెప్పాలని సూచించారు.

### 12 ఎంపీ సీట్లు గెలిస్తే రాష్ట్ర రాజకీయాలను శాసిస్తాం

తెలంగాణ తెస్తారా? అని ఆనాడు ఎందరో హేళనగా మాట్లాడారని, కానీ ఐదుగురు ఎంపీలతోనే పార్లమెంట్‌లో కొట్లాడి, కేంద్రం మెడలు వంచి రాష్ట్రాన్ని తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ గుర్తు చేశారు. ఎక్కువ సీట్లు వస్తే ఇప్పుడు తోకలు జాడిస్తున్న పోలీసులు కూడా అప్పుడు మనకు సలాం కొడుతారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మోసం చేసి గెలిచి, ఆరు గ్యారెంటీలకు ఎగనామం పెట్టిన కాంగ్రెస్‌పై నాలుగు నెలల్లోనే వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే హామీలు అమలుచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. కారులో లోడ్ ఫుల్‌గా ఉందని, ఏ ఊరిలో చూసినా మనమే ఉన్నామని, మీరంతా తలుచుకుంటే వినోద్‌కుమార్ గెలుపు కష్టంకాదన్నారు. వచ్చే పది రోజులు ప్రజల్లోకి వెళ్లి చైతన్యవంతం చేసి ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని బండి సంజయ్ అంటున్నడు. హేళనగా మాట్లాడుతున్నడు. బీఆర్‌ఎస్ నాయకుల సత్తా ఏమిటో చూపించి వినోద్‌కుమార్‌ను గెలిపించి దిమ్మతిరిగే సమాధానం ఇవ్వాలి. ప్రజాశక్తిని మించిన ఏ శక్తి మరొకటిలేదని, బీఆర్‌ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు గెలిస్తే రాష్ట్రంలో కేసీఆర్ మరోసారి రాజకీయాలను శాసిస్తారు. - బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### మనల్ని ఓడించేందుకు కుట్రలు

బండి సంజయ్, రేవంత్‌రెడ్డి మంచి అవగాహనతో ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగానే కాంగ్రెస్‌తో పంచాయితీ లేదని బండి సంజయ్ మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీతో బీఆర్‌ఎస్‌కు అవగాహన ఉంటే కవితను ఎందుకు అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. 2014, 2019 ఎన్నికల్లో దేశంలో మోదీ హవా ఉన్నా..? తెలంగాణలో అడ్డుకున్నది కేసీఆర్ కాదా..? అని ప్రశ్నించారు. చోటా భాయ్ ఈ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో ఉండరని బీజేపీలో చేరుతారని జోస్యం చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఏకమై బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించే కుట్రలు పన్నుతున్నారని, దీనిని బీఆర్‌ఎస్ కార్యకర్తలు అర్థం చేసుకోవాలని సూచించారు. శ్రీరాముడు అందరివాడని, దేవుడి పేరు చెప్పి బండి సంజయ్ ఓట్లు అడగడం సిగ్గుచేటని, శ్రీరాముడికి ఎవరిని గెలిపించాలో తెలుసునని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలపై బీఆర్‌ఎస్ శ్రేణులందరూ ఇంటింటికీ వెళ్లి చర్చ పెట్టి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సూచించారు. మే13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలిపించాలని కోరారు.

### చచ్చేవరకు బీఆర్‌ఎస్‌లోనే ఉంటా..



కరీంనగర్‌లో వినోద్‌కుమార్ గెలుపు ఖాయం. కాంగ్రెస్ అభ్యర్థి డమ్మీ వ్యక్తి. ఇక బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి ఏమీ తెలువదు. ఐదేండ్లలో చేసిందేమీ లేదు. వినోద్‌కుమార్ మంజూరు చేయించిన వరంగల్, నిజామాబాద్ జాతీయ రహదారిని అతను మంజూరు చేయించినట్లు బండి సంజయ్ చెప్పుకోవడం సిగ్గుచేటు. అసలు ఆ రహదారి రూట్ మ్యాప్ ఎట్లుంటదో సంజయ్‌కి తెలుసా. తెలిస్తే చెప్పాలి. కేసీఆర్ ఉన్నప్పుడు రాష్ట్రం ఎట్లున్నదో, ఇప్పుడు ఎట్లున్నదో ఆలోచించాలి. రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చినన్ని ఉద్యోగాలు దేశంలో ఇంకెవరైనా ఇచ్చినట్లు నిరూపిస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. నేను పార్టీ మారుతానని కొందరు ప్రచారం చేస్తున్నరు. అది పూర్తిగా అవాస్తవం. చచ్చేదాకా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా.

- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే

### 2లక్షల మెజార్టీతో గెలుస్తరు..



బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిని, అవగాహన లేని వ్యక్తిని పోటీలోకి దించింది. ఆయన ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటనే విషయాన్ని ప్రజలు మర్చిపోవద్దు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసింది. నాలుగు నెలల్లోనే ప్రజలకు నరకం చూపుతున్నది. కుక్కకాటుకు చెప్పు దెబ్బ అన్న చందంగా ప్రజలకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నరు. వినోద్‌కుమార్ 2 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుస్తరు.

- రసమయి బాలకిషన్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే

### ఓటడిగే హక్కు నాకు మాత్రమే ఉంది



కరీంనగర్‌కు రూ.వెయ్యి కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసిన నాకు మాత్రమే ఇక్కడి ప్రజల్ని ఓట్లు అడిగే హక్కు ఉంది. దేశ సేవ చేస్తా అనే వ్యక్తి మళ్లీ ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎందుకు పోటీ చేశారో చెప్పాలి. ఎంపీ పదవి ఏమైనా పునరావాస కేంద్రమా..?. బండి సంజయ్ ఐదేళ్లల్లో జడ్పీ, మున్సిపాలిటీలకు చెందిన ఏ ఒక్క మీటింగ్‌కు అయినా హాజరయ్యాడా..?. ప్రజలపై, ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి, అవగాహన లేని వ్యక్తి ఎంపీగా పోటీ చేయడం అవసరమా?. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటు కేవలం జాతీయ పార్టీలతోనే అవుతుందని విమర్శించి, హేళనగా మాట్లాడిండు. కానీ, బీఆర్‌ఎస్ ఐదుగురు ఎంపీలు పార్లమెంట్‌లో పోరాటం చేసి 32 పార్టీలను ఏకం చేసి రాష్ట్రాన్ని సాధించాం. ఇప్పుడు బీఆర్‌ఎస్ ఎంపీలు ఉంటేనే పార్లమెంట్‌లో నిలదీసి తెలంగాణ అభివృద్ధికి నిధులు తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. బీజేపీ మతం, కులం పేరుతో రెచ్చగొట్టి ఓట్లు దండుకుంటున్నది. ఇలాంటి రాజకీయాలు చేస్తారా..?. మేం ప్రజల కోసం, ప్రజల సేవ కోసం పని చేస్తాం. బండి సంజయ్ ఈ ఐదేండ్లలో ఒక్క గుడికి అయినా నిధులు తెచ్చారా..?. నేను ప్రభుత్వాన్ని ఒప్పించి కొండగట్టు దేవాలయానికి 334 ఎకరాల భూమిని ఇప్పించా. కాంగ్రెస్ పాలనలో ఘోరంగా విఫలమైంది. ఆ పార్టీ పని అయిపోయిందని ప్రజలే చెప్పుకొంటున్నారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కరీంనగర్‌ను అభివృద్ధి చేసే బాధ్యత నాదే. నన్ను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజల పక్షాన సమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతా. నేను ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తీసుకువచ్చి రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశా. కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే లైన్‌ను తీసుకువచ్చిన ఘనత మాకే దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారంటీలతో మోసపోయాం. మళ్లీ మోసపోవద్దు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న చొప్పదండిని మునిసిపాలిటీగా మార్చి అభివృద్ధి చేశాం. రూ.33 కోట్లతో సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టాం. ప్రభుత్వం మారిన తర్వాత అభివృద్ధి పనులు ఆగిపోయాయి. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్ దృష్టి పెట్టడం లేదు.

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



అల్గునూర్‌లో జరిగిన మానకొండూర్ నియోజక వర్గ బూత్ స్థాయి కమిటీల సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

### ప్రశ్నించే గొంతుక వినోద్‌కుమార్



కరీంనగర్ అభివృద్ధి కోసం ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా ఉంటేనే కేంద్రం నుంచి నిధులు వస్తాయి. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. కోట్లాది నిధులు తెచ్చారు. గ్రామ స్థాయి నుంచి ఎంపీ వరకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఉంటేనే వేగంగా అభివృద్ధి జరుగుతుంది. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజెప్పి చైతన్యం తేవాలి. పార్టీ కార్యకర్తలు, నాయకులు వచ్చే పది రోజులు చాలా కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో ఈ ఎన్నికల్లోనూ పనిచేస్తేనే విజయం సాధిస్తామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్‌లోని సమావేశానికి హాజరైన మహిళలు, నాయకులు, కార్యకర్తలు

# పెరుగుతున్న పౌర చైతన్యం



ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్న సిబ్బంది

- ఎన్నికల నిబంధనల ఉల్లంఘనులపై ఫిర్యాదుల వెల్లువ
- 1950, సీ-విజిల్‌కు పెరుగుతున్న ఆదరణ

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 28 : ఎన్నికలేవైనా పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న కృషి ఫలిస్తోంది. మారుతున్న కాలానికనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతులు అమల్లోకి తెచ్చి, వాటిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో సక్సెస్ అవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో మనకెందుకులే అనుకునే స్థాయి నుంచి కళ్లకు కనిపించిన మరుక్షణమే అరచేతిలో నుంచే సమాచారం చేరవేసేలా పౌరుల్లో చైతన్య బీజాలు నాటింది. దీంతో, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ఉల్లంఘనులపై ఫిర్యాదుల వెల్లువ మొదలు కాగా, వెంట వెంటనే కేసులు కూడా నమోదవుతుండడంతో అభ్యర్థుల్లో నిబంధనల గుబులు వెంటాడుతోంది. ఎన్నికల్లో జరిగే అవినీతి, అక్రమాలను అడ్డుకోవడం సామాజిక బాధ్యతగా ప్రచారం చేస్తూ, శ్రమలేకుండా అరచేతి నుంచే ఫిర్యాదు చేసే డిజిటల్ విధానానికి ఈసీఐ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 1950 కాల్‌సెంటర్, సీ-విజిల్ యాప్, ఈ-సువిధ వంటి పలు యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఎన్నికలకు సంబంధించి తమకు వచ్చే అనుమానాలను కాల్‌సెంటర్ ద్వారా ఓటర్లు నివృత్తి చేసుకుంటున్నారు. ప్రధానంగా ఎపిక్ నంబర్లు తెలుసుకోవడం, కొత్త ఎపిక్ కార్డులు, పోలింగ్ కేంద్రాల వివరాలు, హోం ఓటింగ్ విధానం, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న వసతులు, తదితర వివరాలపై ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌కు నిత్యం ఫోన్లు వస్తున్నట్లు నోడల్ అధికారి నాగార్జున పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు 800 పైచిలుకు కాల్స్ వచ్చినట్లు తెలిపారు. అలాగే, ఎన్నికల సంఘం సూచించిన గడువు మించి అభ్యర్థులు ప్రచారం చేస్తుండడం, ఈసీ సూచించిన డెసిబుల్స్ ధ్వని కన్నా అధికంగా వినియోగిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుండడం, ఒకేచోట ప్రచార వాహనాలు నిలపడం, ఓట్ల కోసం పార్టీలు, అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న విధానం, నజరానాల పంపిణీ, ఈ-సువిధలో తీసుకున్న సమయాన్ని మించి ప్రచారం చేస్తుండడంపై సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు వస్తున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడిస్తున్నారు. 103 ఫిర్యాదులు రాగా, సత్వరమే స్పందిస్తూ తగిన చర్యలకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 15, హుజూరాబాద్ నుంచి 7, కరీంనగర్ నుంచి 66, మానకొండూర్ నుంచి 15 వరకు వచ్చినట్లు అధికారులు విడుదల చేసిన గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఎన్నికల తంతు ముగిసే వరకు వీటి సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉండనున్నాయి. నియమావళి ఉల్లంఘనులపై సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తుండగా, అది నేరుగా జిల్లా ఎన్నికల సంఘానికి చేరుతుంది. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లోనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి మరో ఐదు నిమిషాల్లో క్షేత్రస్థాయిలో తిరిగే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు చేరవేస్తారు. ఆ బృందాలు 15 నిమిషాల్లో ఫిర్యాదు చేసిన స్థలానికి వెళ్లి విచారిస్తూ, అరగంటలో రిటర్నింగ్ అధికారికి నివేదిక అందజేస్తుండగా, 50 నిమిషాల్లో పరిశీలించి, ఉల్లంఘనలు జరిగితే తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రోజురోజుకూ సీ-విజిల్ ఫిర్యాదులు పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# రూ.1.06 కోట్ల నగదు జప్తు

- రూ. 92.46 లక్షలు విడుదల
- పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్ 28: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.1,06,62,092 జప్తు చేయగా, వీటిలో రూ.92,46,402ను విడుదల చేసినట్లు రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ.9,85,850 సీజ్ చేశామని, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ. 6,81,830 సీజ్ చేశామని వివరించారు. ఆధారాలను పరిశీలించి రూ. 3,08,990 లను విడుదల చేశామని పేర్కొన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ.10,00,500లు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి పూర్తి స్థాయిలో సొమ్ము విడుదల చేశామని తెలిపారు. ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ. 25,66,710 ల నగదు, రూ.28,600ల విలువైన 80 చీరలు సీజ్ చేయగా, సరైన ఆధారాలు పరిశీలించి రూ. 25,09,710లు, 80 చీరలను విడుదల చేశామని వివరించారు. చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ. 5,49,200లు, బెల్లంపల్లి పరిధిలో రూ. 37,45,272, మంచిర్యాల పరిధిలో రూ. 11,27,730లు సీజ్ చేయగా, ఆధారాలు పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తి స్థాయిలో నగదును విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా సీజ్ చేసిన నగదు రూ. 1. 06కోట్లలో సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ రూ. 92,46,402 లను విడుదల చేసినట్లు, వివరించారు. సరైన ఆధారాలు సమర్పించని కారణంగా రూ. 14,15,690లను విడుదల చేయలేదని ఆయన తెలిపారు.

## యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 28: జిల్లాలోని యువత అసాంఘిక కార్యకలాపాలు, చెడు వ్యసనాలకు అలవాటుపడి బంగారంలాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్పీ అఖి ల్ మహాజన్ సూచించారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి 'ఆపరేషన్ చబుత్రా' పేరుతో జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అర్ధరాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్లు, ఫుట్‌పాత్‌లపై గుం పులుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మద్యం తాగి రోడ్లపై వాహనాలతో రాష్‌డ్రైవింగ్, హారన్లు కొడు తూ అనుమానస్పదంగా తిరుగుతున్న 256 మంది యువకులను అదుపులోకి తీసుకొని, 81 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. యువతే లక్ష్యంగా ఆపరేషన్ చబుత్రా పేరుతో తరచూ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సామన్యులు, మహిళలకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఉప సంహారణకు నేడే తుది గడువు

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దాఖలు చేసిన నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకునేందుకు సోమవారమే తుది గడువు అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు నిర్ణీత నమూనా 5లో కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మూడు గంటల అనంతరం ఉపసంహారణకు వస్తే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి గడువులోగా మాత్రమే నామినేషన్ల ఉపసంహరణకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.